

రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని రైతుబజార్‌ను పూర్తిగా వినియోగంలోకి తేవాలని ఇందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం రైతుబజార్ అంశంపై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారితో కలెక్టరేట్‌లోని తన చాంబర్లో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా రాయచోటిలోని రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయుటకు రోడ్డు సైడ్ ఉన్న చిన్న చిన్న వ్యాపారులను ఆహ్వానించాలన్నారు. టి కొట్టు, డ్రై ఫ్రూట్స్, ఆయిల్ విక్రేతలు, టైలరింగ్, జనరల్ షాప్ తదితర వ్యాపారాలు చేసుకునే వారిని రైతు బజార్లో షాపులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఆసక్తి కలిగిన చిరు వ్యాపారులు ఎవరైనా మాసాపేటలోని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కార్యాలయంలో తమ వివరాలతో దరఖాస్తు సమర్పించవచ్చునని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి టి.త్యాగరాజు పేర్కొన్నారు.

వైవీయూలో డిగ్రీ కోర్సులు

- ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం డిగ్రీ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు విశ్వవిద్యాలయ బాధ్య రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి వెల్లడించారు. బుధవారం వైవీయూ సిపి బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో దూర విద్యా సంచాలకులు ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, ప్రొఫెసర్ అమృత ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి)-2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి బిఎస్‌సి (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సులు చదవడం ద్వారా భవిష్యత్తు, ఆధారిత విద్యా లభించడంతోపాటు ఎంచుకున్న రంగంలో లోతైన నైపుణ్యాన్ని గడిస్తారన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్‌లను జాబ్ మార్కెట్ కు సరిపడా జ్ఞానం స్కిల్ పొంది సమాజ భవిష్యత్తు అవసరాలు తీర్చగల యొక్క పౌరులుగా తయారవుతారన్నారు. బిఎస్‌సి(ఆనర్స్) ఫిజిక్స్ సబ్జెక్టుతోపాటు కంప్యూటర్ సైన్స్, నానో-సైన్స్, కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్ , టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బిఎస్‌సి (ఆనర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతోపాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ చదువచ్చన్నారు. బికాం (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్‌ను ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. బిజినెస్ కామర్స్ కంప్యూటర్ సైన్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇనార్మేషన్ సిస్టం మేనేజ్మెంట్ వంటి అంశాలలో బలమైన పునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్స్ ఉత్తమ మార్కులతో పూర్తి చేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశాలు ఉందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం 21వ శతాబ్దంలో ప్రపంచ అవసరాలకు తగ్గట్టు విద్యను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. వినూత్నమైన కోర్సులు, అత్యాధునిక ల్యాబ్ లు, నిష్ణాతులైన, ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన పరిశోధకులు, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం వైవీయూలో ఉందని చెప్పడానికి సంతోషిస్తున్నామన్నారు. నిపుణులైన పరిశోధకులు ఆహ్వానించి నిరంతరం సెమినార్లు, వర్క్ షాప్‌లు, సింపోజియంలు నిర్వహిస్తున్నామని తద్వారా విద్యార్థుల జ్ఞానం పెరుగుతుందన్నారు. విశాలమైన ఆట స్థలంతో పాటు, అధునాతన జిమ్ సౌకర్యం, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థుల నిరంతరం చదువుకునేందుకు వేలాది పుస్తకాలు, జర్నల్స్ కలిగిన అధునాతన గ్రంథాలయం క్యాంపస్‌లో ఉందన్నారు. విద్యార్థి వైవీయూలో ప్రవేశం పొందడం ద్వారా ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను పొందుతారన్నారు. ఆధునిక హాస్టళ్లలో సౌకర్యవంతమైన, సురక్షితమైన అభ్యాస వాతావరణాన్ని లభిస్తుందన్నారు. సెంటర్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ దూరవిద్య కోర్సులకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఉద్యోగులకు, విద్యార్థులకు అదనపు డిగ్రీలు పొందేందుకు వైవీయూ దూరవిద్య అందుబాటులోకి తెచ్చిందన్నారు. 8 కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒకే సమయంలో ఒక రెగ్యులర్ కోర్సు, మరొకటి డిస్టెన్స్ కోర్సు చదువుకోవచ్చని రెండింటికి ఒకే విలువ ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

కొత్త నేర చట్టాలపై సమీక్ష జరగాలి

- విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై తిరిగి సమీక్ష జరపాలని, అంతవరకు చట్టాల అమలు చేయడం ఆపివేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య భారత న్యాయ వాదుల సంఘం ఉమ్మడి కడపజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి డి.నాగముని నేతృత్వంలో న్యాయ వాదులు విధులను బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులు తమకు అన్యాయం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులను అదుపులోనికి తీసుకొని కేసును విచారణ జరపాలన్నారు. కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే జరిగిన సంఘటనపై పోలీసులు ప్రాథమిక విచారణ చేసిన తర్వాత ఎఫ్ఐఆర్ చేయవచ్చునని నిబంధన పెట్టడం బాధితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. పోలీసులకు అపరిమిత అధికారాలు వచ్చి ఇష్టం వచ్చినట్లు చేసే అవకాశం ఉందని అన్నారు. రిమాండ్‌కు తరలించిన తర్వాత 15 రోజుల్లోగా నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఇప్పటివరకు ఉండగా నూతన చట్టాలతో 90 రోజుల వరకు పోలీసులు కస్టడీలోనికి తీసుకొనే అధికారం పోలీసులకు ఇవ్వడం దారుణమన్నారు. ఈ నిబంధనతో చాలాకాలం వరకు నిందితులు జైల్లో మగ్గాల్సి వస్తుందని వారన్నారు. బ్రిటిష్ వారు తెచ్చిన రాజా ద్రోహం చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయగా కొత్త నేర చట్టాలలో దానిని మరింత కఠిన తరం చేసి దేశద్రోహం చట్టంగా మార్చడం రాజ్యాంగంలోని బావ ప్రకటన స్వేచ్ఛ ఆర్టికల్ 19కు, జీవించే హక్కు ఆర్టికల్ 21 కి ఇది పూర్తిగా విరుద్ధమని అన్నారు. నిందితులను కోర్టుకు తీసుకెళ్లే సమయంలో సంకెళ్లు వేయకూడదని సుప్రీంకోర్టు ఎన్నో తీర్పుల్లో చెప్పినప్పటికీ సంకెళ్లు వేయవచ్చునని ఏకంగా చట్టాన్ని చేయడం సరికాదన్నారు. పార్లమెంట్‌లో ఏ బిల్లు పెట్టినప్పటికీ అది ఇంగ్లీషులో మాత్రమే ఉండాలని ఆర్టికల్ 348లో ఉండగా ఐపిసి, సిఆర్‌పిసి ఎవిడెన్స్‌లకు అర్థం కాని భాషలతో వాటి పేర్లను మార్చివేసి గంద రగోళం చేశారని విమర్శించారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను, భారత రాజ్యాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా తీసుకొచ్చిన కొత్త నేర చట్టాల సమీక్ష జరిగినంతవరకు ప్రజలందరూ ఉద్య మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ధనుంజయ్ కుమార్, చిన్నయ్య, ఆనంద్‌కుమార్, హుమాయూన్ భాష, రవిశంకర్, ఖాదర్‌బాషా, నిరంజన్, ఖిజరలి, ఉత్తేజ్ కుమార్, చంద్రశేఖర్, నాగాంజనేయులు పాల్గొన్నారు.



జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

మల్లెమాల సేవలు ప్రశంసనీయం : 'మూల'



మల్లెమాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి-కడప అర్బన్

వైద్యుడిగా, సాహితీకారుడిగా, సంఘసేవకుడిగా, ఆధ్యాత్మిక సంస్థల సంచాలకులుగా డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని వైవీయూ పాలక మండల సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించింది. తొలుత మల్లెమాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లెమాల నిరంతరం వైద్యసేవలందిస్తూనే సాహిత్యరంగాన్ని వదలకుండా అనేక రచనలు చేశారని ఎంతో మంది యువ రచయితలకు మార్గదర్శకులయ్యారని పేర్కొన్నారు. కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా సుప్రసిద్ధుల్కెన మల్లెమాల వారి ఆవలిగట్టు నవల, జ్వలనం కథాసంపుటి ప్రసిద్ధమైనవని, చచ్చేమి సాధిస్తావు మొదల్కెన నాటకాలు కూడా రాశారని పేర్కొన్నారు. కొండూరు జనార్ధనరాజు మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డి గతంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రితో కలసి కడప జిల్లా రచయితల సంఘం ఆవిర్భావానికి కృషి చేశారని ఆ సంస్థకు ఎన్నో ఏళ్ళు అధ్యక్షుడిగా ఉండి ప్రసిద్ధులైన కవులను, రచయితలను కడపకు రప్పించి సాహిత్య కార్యక్రమాలు చేశారన్నారు. డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి మాట్లాడుతూ సాహిత్య అకాడమీ సభ్యులుగా, అధికార భాషా సంఘం సభ్యులుగా ఆయన తెలుగు భాష, సాహిత్యాలకు సేవలందించారని తెలిపారు. కడపలో రాజీవ్ విద్యా కేంద్రాన్ని స్థాపించి ఆధ్యాత్మిక ప్రగతికి తన వంతు కృషిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూల అయ్యవారురెడ్డి, డేవిడ్, విజయ్, సతీష్, గొబ్బూరి కోటేశ్వరరావు, బాబు, జ్యోతి జార్జి పాల్గొన్నారు.

సమర్థవంతంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ

- ఆర్‌జెడి రాఘవరెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్‌జెడి రాఘవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రీజియన్ లెవెల్ అటల్ ల్యాబ్‌ల వర్క్‌షాప్‌ను స్థానిక మాసాపేటలోని జడ్‌పి హైస్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జెడి రాఘవరెడ్డి, డిఇఒ శివప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ మూసపోసిన బోధన విధానానికి స్వస్తి పలకాలని, ప్రయోగాలు నిర్వహిస్తూ పాఠ్య బోధన జరపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఉపయోగించుకొని విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలను పెంపొందింపజేస్తూ, నూతన ఆవిష్కరణలను రూపొందించాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలను ఉపయోగించుకొని విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ గ్రేటర్ రాయలసీమ పరిధిలోని పది జిల్లాల జిల్లా సైన్స్ అధికారులకు, హబ్ ఎటిఎల్ ప్రధానోపాధ్యాయులకు, ఇన్‌ఛార్జి టీచర్లకు మూడు రోజుల పాటు వర్క్ షాప్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనిసెఫ్ సహకారంతో, రాష్ట్ర సమగ్ర శిక్ష ఈ వర్క్ షాప్‌ను నిర్వహిస్తోందని అన్నారు. ప్రతి జిల్లా నుంచి ఒక హబ్ అటల్ టింకరింగ్ ల్యాబ్ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించేలా చేయడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పూణేకు చెందిన విగ్యాన్ ఆశ్రమానికి చెందిన వెంకటేష్, హేమలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఎఎంఒ సమీవుల్లా, డిసిఇబి సెక్రటరీ నాగమునిరెడ్డి, నోడల్ టీచర్ ఆంజనేయులు, గ్రేటర్ రాయలసీమలోని పది జిల్లాల నుంచి హబ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ అధికారులు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌ఛార్జి టీచర్‌లు పాల్గొన్నారు.

వైవీయూ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ, లలిత కళల విభాగం నిర్వహిస్తున్న నృత్యం, కీబోర్డు, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను అందరికీ అందుబాటులో ఉండేటట్లు శ్రీ హరి డిగ్రీ కాలేజ్‌లో నిర్వహిస్తున్నారు. సుమారు 100 మంది పరీక్షకు హాజరయ్యారని ఆ విభాగం అధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావు తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పరీక్ష కేంద్రాన్ని, నిర్వహణ తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళను అభ్యసించాలని చెప్పారు. తద్వారా అది మనిషిని సంస్కరిస్తుందన్నారు. శ్రీ హరి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, విశ్వవిద్యాలయం పిఆర్ఒ డాక్టర్ ఎస్.వి.సుబ్బారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షులు నందగోపాల్, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి వెల్లడించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశమై నూతన కమిటీ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 26న మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశానికి 207 మంది సభ్యులు హాజరు కాగా పాత కమిటీని రద్దు చేస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. పాత కమిటీ కోర్టుల చుట్టూ తిరగడం వలన కార్మికులకు ఇప్పటికే చాలా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత కమిటీ వారు రికార్డులను వెంటనే కొత్త కమిటీకి అప్పగించాలని కోరారు. నూతన కమిటీలో అధ్యక్షులుగా ఎస్.నందగోపాల్, ఉపాధ్యక్షులుగా యం.క్రిష్ణారెడ్డి, అడ్వజర్ వి.సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీ జి.భాస్కర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు యస్.సుధాకర్‌రెడ్డి, జి.రామసుబ్బారెడ్డి, యం.చెన్నారెడ్డి, ఇ.శివమల్లప్పనాయుడు, యం.కె.ముని రత్నం, యం.భాస్కర్ రెడ్డి, కోశాధికారి కె.రవిచంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నందగోపాల్



సూర్యదేవర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

బహుభాషా కోవిదులు 'సూర్యదేవర సంజీవ్ దేవ్'

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం సూర్యదేవర సంజీవదేవ్ 110వ జయంతిని నిర్వహించారు. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, బహు భాషాభిజ్ఞునిగా, లలితకళా విమర్శకునిగా ప్రఖ్యాతి పొందిన దర్శనకారుడు సూర్యదేవర సంజీవదేవ్ అని పేర్కొన్నారు. ఆయన 1914, జులై 3వన తేదీన గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం, తుమ్మపూడి గ్రామంలో జమిందారి కుటుంబంలో జన్మించారన్నారు. హిమాలయాల పట్ల ప్రేమ పెంచుకొని ఇంట్లో చెప్పకుండా 26 ఏళ్ళ వయస్సులో ఇల్లు విడిచి పెట్టి దేశ సంచారం చేశారన్నారు. హిమాలయాలల్లో ప్రకృతి చిత్రాలను వేయడం తోపాటు 30 ఏళ్ళ లోపలే హిమాలయాలతో సహ ఉత్తర భారతదేశం మొత్తం తిరిగారన్నారు. ఆయన హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఫ్రెంచ్, జపానీస్ నేర్చుకున్నారన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ సంజీవదేవ్‌కు ఎస్పరాంటో అనే కృత్రిమ అంతర్జాతీయ భాషలో కూడా ఈయనకు ప్రవేశం ఉందని, జయదేవుని గీత గోవిందంతో ప్రారంభించి కాళిదాసు రచనలన్నిటిని చదివేశారన్నారు. లక్నోలో అసిత్ కుమార్ హాల్దార్ వద్ద చిత్రలేఖనం అభ్యసించారని, లక్నోలో ఆయనకు విశ్వకవి రవీంద్రుని కలిసే భాగ్యం కలిగిందన్నారు. బెంగాలీ సాహిత్యం, చిత్రకళపై పట్టున్న సంజీవ్ దేవ్ రవీంద్రనాద్ టాగోరుతో బెంగాలీలో మాట్లాడటమే కాకుండా రవీంద్రుని రెండు బెంగాలీ కవితల్ని చదివి వినిపించారన్నారు. 'కవిగా జీవించగలిగేతేనే చాలదు. మనిషిగా జీవించ గలిగితేనే కవిగా జీవించినట్టు' అన్న గురుదేవులు రవీంద్రుని మాటలను మహోపదేశంగా స్వీకరించి ఆచరణలో ఆచరించి చూపారన్నారు. సంజీవదేవ్ చిత్రకళ, ఫొటోగ్రఫీలో కూడా మంచి అభిరుచి కలవారని, ఆ రంగాలలో లోతయిన అధ్యయనం చేశారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, రాణి, సుమతి, అరుణ, హరికృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం కార్యదర్శిగా షేక్ మహమ్మద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం కార్యదర్శిగా షేక్ మహమ్మద్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మదనపల్లె టెలిఫోన్ ఎక్సెంజ్ ప్రాంగణంలో జరిగిన ఆలిండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మదనపల్లె శాఖ సర్వసభ్య సమావేశంలో రిటైర్డ్ ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ మహమ్మద్ బాషాను వచ్చే రెండేళ్ల కాలానికి కార్యదర్శిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రత్నవేణి, కోశాధికారిగా ఎం.రెడ్డెప్పలు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి సౌందర్ రాజన్, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్, రెవిజన్ విషయంలో అనుకూలంగా తీర్పులు ఇచ్చినా కేంద్ర ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. ఈ విషయంలో కొత్తగా ఎన్నికైన తాము ప్రభుత్వంపై వత్తిడి పెంచుతామని, మదనపల్లె డివిజన్‌లోని పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.

మహిళలకు అండగా సఖి సెంటర్ : జడ్జి

ప్రజాశక్తి-కడప : ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ (సఖి) అని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జడ్జి రిమ్స్ ఆవరణలోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే చోట అనేక సేవలు కలవన్నారు. వన్ స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయని పేర్కొన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాపులు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాల్లో మహిళలు సంప్ర దించవచ్చని పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మహిళలకు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబ ర్లపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశ్వని, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జోరందుకుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్నారు. నిమ్మనపల్లి ప్రాజెక్టు ఏరు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకాసరులు ప్రతి రోజూ టిప్పర్లతో అక్రమమార్గాన తరలిస్తూ లక్షలాది రూపాయలు గడుస్తున్నారని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేయాల్సిన అధికారులు ఎందుకు టిప్పర్ల జోలికి పోవడం లేదని ప్రశ్నించారు. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు తక్షణమే స్పందించి ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

25న కృత్రిమ కాలు క్యాంపు నిర్వహణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈనెల 25న గురువారం కడప, అన్నమయ్య జిల్లాలలో విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసే క్యాంపును నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు హుస్సేన్ తెలిపారు. కడప కలెక్టర్ కార్యాలయంలోని డి- బ్లాక్ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ఈ క్యాంపు చేపడుతున్నట్లు తెలిపారు. రెండు జిల్లాల్లో ఒకేసారి కాలు కొలతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 20 రోజుల తరువాత రూ.51వేలు విలువ గల ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చబడునని తెలిపారు. అవసరమైన విభిన్న ప్రతి భావంతులు 9966445110 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచిం చారు. క్యాంపు కు వచ్చేవారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మెడికల్ సర్టిఫికెట్ లను రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశం కేవలం కడప, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతులకు మాత్రమేనని తెలిపారు.

వైవీయూ పీజీ పరీక్ష వాయిదా

ప్రజాశకి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 4వ తేదీన జరగాల్సిన పీజీ నాల్గవ సెమిస్టర్, డిగ్రీ ఏడవ సెమిస్టర్, ఇంజినీరింగ్, ఎంసిఎ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి సూచనలతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాయిదా పడిన పరీక్షను ఆయా పరీక్షల చివరి పరీక్ష తర్వాత నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి-పీలేరు

రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి సహకరిస్తూ ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేసిన ఆరుగురు ప్రయాణికులకు బహుమతులు ప్రధానం చేసినట్లు పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. పట్టణంలోని మౌర్య కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండులో సోమల - కలకడ, పీలేరు-సుండుపల్లి మార్గాల్లో నడిచే ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేసిన వారిని లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను డాక్టర్ దేవులపల్లి మౌర్యరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ రెండు మార్గాల్లోనూ ఆర్‌టిసి బస్సులను ఆదరిస్తూ ప్రయాణం చేసిన వారిలో ఆరుగురిని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశామన్నారు. ప్రథమ బహుమతికి ఎంపికైన వారిలో ఎన్. రెడ్డమ్మ, కె. మునిరాజ, ద్వితీయ బహుమతి పి. షిఖ, కె భూదేవి, తృతీయ బహుమతికి ఆర్. సాంబశివ, కె. గౌతమ్ లకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌర్య రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని అన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే ప్రయాణం చేసి సంస్థ అభివద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ మౌర్యరెడ్డి



మరుగుదొడ్డి వద్ద నిల్వ ఉంచిన బ్లీచింగ్, సున్నం

సచివాలయంలో వృథాగా బ్లీచింగ్ పౌడర్

పజాశక్తి-చిట్వేలి

పారిశుధ్య చర్యల్లో భాగంగా వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం అందిస్తున్న బ్లీచింగ్ పౌడర్, సున్నం సచివాలయంలో వ్యర్థంగా పోతోంది. మండల పరిధిలోని మైలపల్లి గ్రామపంచాయతీ సచివాలయంలో బ్లీచింగ్, సున్నం సంచులను నీరు నిల్వ ఉన్న చోట వ్యర్థంగా పడేశారు. సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో నీటి నిల్వలు ఉండే చోట బ్లీచింగ్ వేసి గ్రామాల్లో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా, దోమల నివారించేందుకు చర్యలు తీసుకోకుండా ఇచ్చిన బ్లీచింగ్, సున్నం మూలన పడేయడంతో తడిసి నీటి పాలవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ, వైద్యధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా సిబ్బంది మాత్రం ఎటు వంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి ముద్దచర్మ వ్యాధికి టీకాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పశువులలో సాధారణంగా కనిపించే ముద్దచర్మ వ్యాధి లేదా బొబ్బర్ల వ్యాధి నివారణకు నేటి నుంచి టీకాలను వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ సాధు సురేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పశువులలో కనిపించే ముద్దచర్మ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. మండలంలో ఇప్పటివరకు 6500 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి సోకిన పశువులకు చర్మం మీద బొబ్బలు, దద్దుర్లు రావడం, అలర్జీ ఉండడం, పాలదిగుబడి తగ్గడం, మేత మేయక పోవడం వంటి లక్షణాలతో అనారోగ్య సమస్యల బారిన పడుతుంటాయని అన్నారు. ఈ లక్షణాలు కలిగిన పశువులను పాడి రైతుల ముందుగానే గుర్తించి పశువైద్యులను సంప్రదించాలన్నారు. రైతులు టమోటా పంటకు పురుగు మందులను వాడుతుంటారని, పంటకు వాడే పురుగు మందులు పంట చుట్టూ గట్లుపై ఉన్న గడ్డిపై కూడా పడుతుందని అన్నారు. దానిని రైతులు మరల గడ్డి కోసి పశువులకు మేతగా వేయడం వలన అవి అనేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నాయని తెలిపారు. ప్రధానంగా నోటిలో నురుగుకారడం, నడవలేక పడిపోవడం, మేత మేయకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతూ క్రమంగా క్షీణించి మృతి చెందడం జరుగుతుందని చెప్పారు. సరైన సమయంలో వైద్యం అందించినట్లయితే పశువులను సురక్షితంగా కాపాడుకోవచ్చని అన్నారు. పాడి రైతులు నిర్లక్ష్యం వహించకుండా ముద్దచర్మవ్యాధి లక్షణాలు కలిగిన పశువులకు టీకాలను వేయించుకోవాలని ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు రామసముద్రం మండల సమావేశం

ప్రజాశక్తి-రామసముద్రం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యంపిపి కుసుమకుమారి ఆధ్వర్యంలో గురువారం ఉదయం పది గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మదనపల్లి ఎమ్మెల్యే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు మండల అభివృద్ధి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

క్రైం కార్నర్



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో నిందితుడి అరెస్టును చూపుతున్న సిఐ, పోలీసు సిబ్బంది

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను అపహరించిన దొంగను అరెస్టు చేసి అతని నుంచి సుమారు రూ.7లక్షల విలువగల 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెద్దమండెం మండలం గోపాలోళ్లపల్లె గ్రామానికి చెందిన బుక్కే అశోక్‌నాయక్ దినసరి కూలీగా పని చేస్తూ జీవనం సాగించేవాడని తెలిపారు. దినసరి కూలి ద్వారా వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. జైలుకు వెళ్లి వచ్చినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పాటు మళ్లీ దొంగతనాలకు పాల్పడటం అలవాటుగా చేసుకున్నాడని చెప్పారు. ఇటీవల గాలివీడు రింగ్ రోడ్డులో దొంగిలించిన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా రాయచోటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా జిల్లాలోని రాయచోటి టౌన్, మదనపల్లి, తంబళ్లపల్లె, పీలేరు, తిరుపతి లో పార్కింగ్ చేసినటువంటి 14 ద్విచక్ర వాహనాలను దొంగలించారని పోలీసుల విచారణలో వెల్లడించారు. ద్విచక్ర వాహ నాలను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహ రించిన ఎస్ఐ భక్తవత్సలం, పోలీసు సిబ్బందిని సిఐ అభినందించారు. కార్యక్ర మంలో కానిస్టేబుళ్లు బర్కతుల్లా, రామ్‌నాయక్, మహేంద్ర, హోంగార్డు సురేంద్ర పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ రైల్వేగేట్ వద్ద బుధవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పుంగనూరుకు చెందిన నరసింహులు(40) వాల్మీకిపురం పట్టణం కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలోని రైల్వేగేట్ వద్ద ఎవరూ లేని సమయంలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకొని, సంఘటనాస్థలంలో పడి ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతి చెందిన వ్యక్తి వివరాలు, మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విభిన్న ప్రతిభావంతురాలిని గాయపరిచిన వారిపై కేసు

ప్రజాశక్తి-కలకడ

విభిన్న ప్రతిభావంతురాలిని గాయపరిచిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు.. మండలంలోని కని సెల ఐసి వెలుపు పాలెంలోని బొంతల వారి పల్లికి చెందిన సామిశెట్టి బాబు భార్య సామిశారి దేవి తన పొలంలో పశువులను మేపుకొనుచుండగా ఏనుగొండపాలెం పంచాయతీ గుండా వాండ్లపల్లె కి చెందిన వీర నాగిస్వామయ్య అతని భార్య కాంతమ్మ వీరనాగమ్మ నాయుడు తమ్ముని కొడుకు నాగేశ్వరరావు కలిసి దుర్భాషలాడి కత్తితో చర్య గాయపరిచినట్లు తెలి పారు. దేవికి చెందిన భూమిలో పశువుల మేపుకుంటూ ఉండే తిట్టే ఐంద బూతులు చిట్టి గాయపరిచిన వారిపై దేవి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో డెంగీని తరిమికొడదాం

ప్రజాశక్తి-కలకడ

ప్రజల భాగస్వామ్యంతో డెంగీని తరిమికొడదామని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి.కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎర్కోటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా డెంగీపై లక్షణాలు గురించి, చికిత్స నివారణ గురించి అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగీ జ్వరం ఎడిస్ దోమ ద్వారా వైరస్ ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. తీవ్ర జ్వరం, తలనొప్పి,కీల్లు, కండరాల నొప్పులు,వికారం, చర్మం పై దద్దర్లు, అలసట ఉన్నట్లు అయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. డాక్టర్ సలహా మేరకే చికిత్స చేయించు కోవాలని సూచించారు. రక్త కణాలు తగ్గి డెంగీ షాక్ సిడ్రోమ్ వచ్చి ప్రమాదకంగా మారుతుందని అన్నారు. దోమలు కుట్ట కుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి లోపల దోమతరాలు వాడుకోవాలి, ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిలువ నీటిలో దోమలు పెరగకుండా నివారణచర్యలు చెప్పటాలి, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కొబ్బరి బొండాలు పాత రోళ్ళు. పాత కూలర్స్ పగిలిపోయినా వస్తువులు, పాత టైర్లు, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే, డ్రై డేగా పాటించాలన్నారు. ప్రతి ప్రాథమిక కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ రక్త పరీక్షలు ఎంల్‌హెచ్‌పిలు ఉచితంగా చేస్తారని డాక్టర్ జవహర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్న స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ, ల్యాబ్టెక్నీషియన్ జామిల్‌అహ్మద్, షరీప్‌బాషా సూపర్ వైజర్స్ యం.వెంకటేశ్వర రావు. బి.రెడ్డమ్మ, ఆరోగ్య కార్యాకర్తలు వాణి, శ్రీలక్ష్మి, లక్ష్మి,లక్ష్మిదేవి, భాగ్యమ్మ, వరలక్ష్మి, రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు అశ్విని, రాజా, సులోచన. లావణ్య, కనకమ్మ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి : ఎస్ఐ



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ట్యాక్స్ తదితర వాటిని తమ వద్ద ఉంచుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి చేస్తే వారి తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్ స్పీడు, ఓవర్ లోడు లేకుండా యూనిఫారం ధరించి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-నందలూరు

రాజంపేట సబ్ డివిజన్‌లోని నందలూరు, చిట్వేల్, రాజంపేట అర్బన్ పోలీసుస్టేషన్‌లో నమోదయిన 27 కేసుల్లో సీజ్ చేసిన రూ.71,753లు విలువ చేసే 472మద్యం బాటిల్స్, మద్యాన్ని రాజంపేట సబ్ డివిజన్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. ఎస్‌పి కృష్ణారావు ఉత్తర్వులు మేరకు ఎఎస్‌పి డాక్టర్ రాజ్‌కమల్, ఎస్ఇబి ఎస్ఐ శ్రీనివాసులు అధ్వర్యంలో రాజంపేట సబ్ డివిజన్‌లో నమోద యిన కేసులలోని సీజ్ చేసిన మద్యాన్ని మండలం లోని అల్వీన్ ఫ్యాక్టరీ వద్దనున్న చీకి చెట్లలో డోజర్ ద్వారా నేల మట్టం చేశారు. కార్యక్రమంలో నందలూరు, రాజంపేట, చిట్వేలి ఎస్ఐలు అబ్దుల్ జహీర్, వెంకటేశ్వర్లు, సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీజ్ చేసిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

రైతు సంఘాలను బలోపేతం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి

రైతులు సంఘాలను బలోపేతం చేసుకుంటే రైతు సంఘాలకు ప్రాధాన్యత ఉంటుందని రాయచోటి ఏరియా కో-ఆర్డినేటర్ కొండా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య మహాజనసభ సమావేశంలో మాట్లాడుతూ రైతు సంఘాలకు వ్యవసాయానికి కావలసిన పెట్టుబడి, బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలతో అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య కో-ఆర్డినేటర్ గంగార్జున మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిం చడానికి జిల్లాలోని 9 మండలాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి తెస్తామని తెలి పారు. గత ఏడాది వార్షిక నివేదిక చదివి వినిపించారు. గత ఆర్థిక సంవత్సరంలో 88 లక్షల లావాదేవీలు జరగడంవల్ల సమాఖ్యకు రూ.17.30లక్షలు ఆదాయం వచ్చిందని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఒడివీడు గ్రామానికి చెందిన జె.రాచయ్య, ఉపాధ్యక్షులుగా గడికోట నుండి వి.వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా చింతాతి రామయ్య, ఉప కార్యదర్శిగా వంగిమల్లకస్పా నుంచి షేక్.సలీం, కోశాధికారిగా ఎం. రాంప్రసాద్ ఎన్నిక య్యారు. కార్యక్రమంలో స్థానిక ఎపిఎం ఖాదర్‌వలి, సిసి వెంకటలక్ష్మి, అకౌంటెంట్ మరి యమ్మ, బిఒడి సభ్యులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ చాంద్‌బాషా

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సిఐ చాంద్ బాషా కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో బుధవారం భారతీయ న్యాయ సంహిత చట్టాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చక్రాయపేట, వేముల, వేంపల్లె మండలాల్లోని అంగన్వాడీలు, మహిళ పోలీసులు, సూపర్‌వైజర్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు వీలుగా అంగన్వాడీలు, మహిళా పోలీసులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కొత్త నేర చట్టాలపై గ్రామీణ ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కొత్త చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. గ్రామాల్లో జరిగే సమస్యలపై ప్రతి వారం పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. తద్వారా గ్రామాల్లో నేరాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఎంపిడిఒ సంపతి దివిజా, తహశీల్దార్ నాయక్, ఐసీడీఎస్ సిడిపిఒ సునీత మాట్లాడుతూ ఐసిడిఎస్ ఎన్నో కార్యక్రమాలు చేపడు తోందన్నారు. బాల్య వివాహాలను కూడా ఆరికట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం బాలస్వామి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

చాపాడు : భారత ప్రభుత్వం బ్రిటిష్ హయాంలో ఉన్న పాత చట్టాలను తొలగిస్తూ వాటి స్థానంలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత 2023 చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ సూచించారు. స్థానిక శ్రీశక్తి భవన్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అన్ని రకాల చట్టాలపై అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాది మాధవీలత నూతన చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి, వెలుగు ఎపిఎం వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ శుభరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



చాపాడు : మాట్లాడుతున్న న్యాయవాది మాధవీలత

హోరాహోరీగా సంత వేలం పాట

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లె సంత మార్కెట్ వేలం పాట బుధవారం హోరాహోరీగా సాగింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూరగాయల సంత, మార్కెట్‌లోని వాణిజ్య గదులకు వేలం పాటను అధికారులు నిర్వహించారు. 9 నెలలకే సంత మార్కెట్‌కు వేలం పాట వేయగా కుప్పాలపల్లెకు చెందిన రామగంగిరెడ్డి రూ.40 లక్షల 30 వేలకు పాట పాడి దక్కించుకున్నారు. గతంలో 12 నెలలు వేలం పాట వేయగా రు.33 లక్షలకు రామగంగిరెడ్డినే పాడారు. ఈ ఏడాది దాని కంటే ఎక్కువగా పాట పడడంతో పంచాయతీకి వేలం పాట ద్వారా ఆదాయం వచ్చినట్లు పంచాయతీ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె :గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఎంపిడిఒ సంపతి దివిజా సూచించారు. స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో బుధవారం తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీమ్ సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై ప్రజల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. వైద్యురాలు స్వాతి సాయి మాట్లాడుతూ అయిదేళ్లలోపు పిల్లలు ఉన్న గృహాలను ఎఎన్ఎం, ఆశా, సిహెచ్‌ఒలు గుర్తించాలన్నారు. ప్రతి ఇంటికెళ్లి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలు జాగ్రతగా ఉండాలని సూచించారు. తాగునీటి పైపు లీకేజీలను గుర్తించి, వాటి మరమ్మతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డీ మల్లికార్జునరెడ్డి, డిఇ సాలన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్‌రెడ్డి, హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సిహెచ్‌ఒలు, సచివాలయ ఇంజనీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను పెంచడం అభినందనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్ పెంచడం అభినందనీయమని స్థానిక ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి మూగ, చెవుడు సంఘం ఆధ్వర్యంలో బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ.. ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథులుగా బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బధిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మి కిషోర్, వెంకటలక్ష్మి, ఖాదర్, బీ కేశవ, లక్ష్మి, అస్లాం మహబూబ్ బాషా, వెంకటసుబ్బయ్య, హనుమంతు, సత్యనారాయణ, మురళి, శివకుమార్ పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి

ఆదర్శ పాఠశాలలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఆదర్శ పాఠశాలను మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి మంగళవారం సందర్శించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల హాస్టల్ ఆవరణంలో రాత్రిపూట వెలుతురు లేక హాస్టల్ వెనక గుట్ట ప్రాంతం ఉండడం వల్ల రాత్రి సమయంలో విష పురుగులు ఎక్కువగా వస్తున్నాయని ప్రిన్సిపల్ శ్యామలాదేవి ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన తన సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయించారు. వెలుతురు సమస్యను పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్క రిస్తానని తెలిపారు. ఆయనతోపాటు ఆదర్శ పాఠశాల సిబ్బంది, టిడిపి నాయకులు చిలేకంపల్లి శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మాజీ ఎంపిటిసి ధర్మయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రగుండ్లమ్మ తిరుణాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లికి సమీపంలో శివపురం వద్ద వెలసిన ఎర్రగుంట్లమ్మ ఆలయంలో బుధవారం వైభవంగా తిరుణాల నిర్వహించారు. పూజారి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు అభిషేకాలతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. చుట్టుపక్కల గ్రామాలలోని మహిళలు నియమనిష్టలతో దీను, బోనాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్ల మెరువని భక్తులనుఅలరింప చేశాయి.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండలంలోని మర్రికుంటపల్లి గ్రామపంచాయతీ సచివాలయాన్ని ఎంపిడిఒ రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులు పరిశీలించి సచివాలయ సిబ్బందితో సమ యపాలన పాటించాలని, వచ్చినటువంటి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, సిబ్బంది సమన్వయంతో అభివృద్ధికి దోహదపడాలని పేర్కొన్నారు. పారిశుధ్యం, మంచినీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌రెడ్డి రామ్ పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న వరలక్ష్మి

ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి సచివాలయాన్ని బుధవారం రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. వృద్ధులకు ఒకటో తేదీన ఏడు వేలు చొప్పున పింఛన్ అందజేసిన క్రమంలో కృష్ణంపల్లి వాలంటీర్ సురేష్ అనే వ్యక్తి గ్రామంలోని వృద్ధుల వద్ద నుంచి 200 రూపాయలు చొప్పున తీసుకోవడం సరికాదని అన్నారు. వెంటనే వారి నగదును వారికి ఇచ్చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, కటికం మనీ, కుమార్, ఈశ్వర్‌నాయుడు, రామకృష్ణ, మల్లికార్జున, చంగయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌తో సేద్యం.. సరికొత్త ప్రయోగం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



బైక్‌తో కలుపు నివారణ సేద్యం చేస్తున్న రైతు

బిందు, తుంపర సేద్యం అనేవి కాకుండా బైకు సేద్యం కూడా ఉంటుందని ఓ రైతు కొత్త ప్రయోగం చేపట్టాడు. కాడెద్దులు కరువై యంత్రాల సేద్యం బరువైన నేపథ్యంలో.. ఈ బైకు సేద్యం ఇప్పుడిప్పుడే రైతులు అలవాటు చేసుకుం టున్నారు. ఈ క్రమంలో లింగాల మండలంలో రైతు తన పంట పొలంలో బైక్‌తో సేద్యం ప్రారంభించాడు. అరటి పంటలో ఎడ్లు, ట్రాక్టర్ సేద్యం తరహాలో బైకు సాయంతో కలుపు నివారణ పనులు ప్రారంభించాడు. ఇలాంటి బైకు సేద్యాలు విజయవంతమైతే ప్రతి ఒక్కరూ బైకు సేద్యం వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా వ్యవసాయం అంటేనే భారమవుతున్న ఈరోజుల్లో మొక్కవోని ఆత్మవిశ్వాసంతో బండికి పెట్రోల్ ఖర్చు కలిసొచ్చిన పర్వాలేదు అనుకుని సేద్యం సాగించడం గొప్ప విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

జాతీయ రహదారి ఏర్పాటుకు కొలతలు

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి నిర్మాణం కోసం రోడ్డు వెడల్పులో భాగంగా (సర్వే) కొలతలు చేపట్టినట్లు జాతీయ రహదారి ఎఇ సురేంద్రరెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం అధికారులు నాలుగు రోడ్ల కూడలి నుంచి రైల్వే గేటు వరకు రెవెన్యూశాఖ సిబ్బందితో రోడ్డుకు ఇరువైపులా సర్వే చేశారు. ఈ సంద ర్భంగా ఎఇ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు వెడల్పు కోసం కొలతలు (సర్వే) తీశామన్నారు. నాలుగు రోడ్ల కూడలి నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వేగేటు వరకు ఒక కిలోమీటర్ మేర రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలం నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు 20 మీటర్లు (65 అడుగులు) ఉంద న్నారు. 18 మీటర్లు వెడల్పులో రోడ్డు, డ్రయినేజీ, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయ నున్నట్లు వివరించారు. పాత బస్టాండ్ కూడలి నుంచి రైల్వే గేటు వరకు 15 మీటర్లు (49 అడుగులు) ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఇందులో ప్రభుత్వ స్థలం వరకు రోడ్డు, డ్రయినేజీ, ఫుట్‌పాత్ నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. నివేదికలు తయారు చేసి ఉన్నతా ధికారులకు అందజేస్తామన్నారు.

మెస్ ఛార్జీల బిల్లులు చెల్లించండి మహాప్రభో..

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని నాలుగు హాస్టళ్లకు సంబంధించి ఎనిమిది నెలల మెస్ ఛార్జీల బిల్లులు రాక వార్డెన్‌లు లబోది బోమంటున్నారు. ఒక్కో హాస్టల్‌కు నెలకు సగటున రూ.50 నుంచి రూ.70 వేలు ఖర్చు వస్తోంది. ఆ మొత్తాన్ని ఇన్ని నెలుగా చెల్లించలేదు. బిల్లులు ఆగిపోవడంతో కూర గాయలు, పాలు, గుడ్లు సప్లై చేసే వారు బిల్లులు ఎప్పుడు వస్తాయో అంటూ ఎదురు చూస్తున్నారు. పిల్లలకు పౌష్టి కాహారం అందించాలనే ఆలోచనలో ఉన్నప్పటికీ సరైన సమయానికి బిల్లులు అందడంలేదని వాపోతున్నారు. అరకొరగా వాడుతూ భోజనాలు పెట్టే పరిస్థితి ఏర్పడింది. అధికారులు బిల్లులు చెల్లించి, పిల్లలకు మంచి భోజనాలు అందేలా చూడాల్సిన అవసరం ఉంది.